## విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించాలి

• రాష్ట్ర మానిటరింగ్ అధికారులు శ్రీహరి, మల్లికార్జున్

గుర్రంపోడ్, డిసెంబర్ 13: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించాలని రాష్ట్ర మానిటరింగ్ అధికారులు శ్రీహరి, మల్లికార్జున్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి ఉపాధ్యాయుల శిక్షణ సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించడంతో వారు అన్ని సబ్జెక్టుల్లో విద్యా ప్రమాణాలను సులభంగా సాధిస్తారని అన్నారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు చేయించడంలో ఉపాధ్యాయులు పిల్లలకు అర్థమయ్యేలా బోధనలో మెళకువలు పాటించాలని సూచించారు. ప్రస్తుతం అమలు జరుగుతున్న అకాడమిక్ బబుల్లో నెల రోజుల పాటు ఆరు అంశాలను అమలుచేసే బాధ్యత టీచర్లదే నని అన్నారు. టీచర్ సపోర్టింగ్ గ్రూపులో విద్యార్థుల్లో సామర్థ్యాల సాధనకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. తొలిమెట్టు ప్రగతిని ఎఫ్ఎల్ఎన్ఎ యాప్‌లో నమోదు చేయాలని కోరారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా టీఎల్ఎంను ఉపయోగించి బోధించాలని సూచించారు. టీచర్లు గ్రామస్తులు, తల్లిదండ్రులతో మంచి సంబంధాలు కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి రామచంద్రయ్య, సీఎంఓ వీరయ్య, మండల విద్యాధికారి తరి రాములు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు అయిటిపాములు యాదగిరి, రిసోర్స్ పర్సన్ యాదగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర మానిటరింగ్ అధికారి శ్రీహరి

## తండాలకు బస్సు సదుపాయం కల్పించాలని వినతి

దామరచర్ల, డిసెంబర్ 13: మండలంలోని గిరిజన తండాలకు బస్సు సదుపాయం కల్పించాలని పుట్టలగడ్డతండా సర్పంచ్ బాష్యానాయక్ మిర్యాలగూడ ఆర్టీసీ డిపోమేనేజర్ పాల్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. మిర్యాలగూడ నుంచి బొత్తలపాలెం, కల్లేపల్లి, తిమ్మాపురం, పడమటితండా, తూర్పుతండా, పుట్టలగడ్డతండాకు బస్సు సదుపాయం లేదన్నారు. యాదాద్రి పవర్‌ప్లాంటుకు ఉపాధి కోసం నిత్యం అనేక మంది వస్తుంటారని బస్సు సదుపాయం లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితబస్సు సదుపాయం కల్పించినా ఉపయోగం లేకుండా పోయిందని, అధికారులు స్పందించి వెంటనే తండాలకు బస్సు సదుపాయం కల్పించాలని ఆయన కోరారు.


ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ బాష్యానాయక్

## కేజీబీవీ పాఠశాలలను పరిశీలించిన తనిఖీ బృందం

వేములపల్లి, డిసెంబర్ 13: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం 14 మంది ఇన్‌స్పెక్షన్ ప్యానెల్ (తనిఖీ) బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా టీం హెడ్ బూరుగు రమేశ్ మాట్లాడుతూ ఉదయం అల్పాహారం నుంచి సాయంత్రం ప్రార్థన సమయం వరకు అన్ని విషయాలను సమగ్రంగా పరిశీలించినట్లు తెలిపారు. పాఠశాలలో భోజనం, పరిశుభ్రత, తరగతి గదిలో బోధన, విద్యార్థుల ప్రవర్తన, పాఠశాల రికార్డులు, విద్యార్థులు సాధించిన గ్రేడ్‌లు పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ టీం సభ్యులు గుడిపాటి కోటయ్య, ఉపేందర్, అఫ్జల్ షరీఫ్, కొండకింది శ్రీను, రాధిక, అనూరాధ, శైలజ, హేమానాయక్, పోకల వెంకటేశ్వర్లు, ప్రత్యేక అధికారిని వసంతకుమారి, సిబ్బంది సునీత, జ్యోతి, జైబున్నీసా, అనూష పాల్గొన్నారు.

### ఉదయం నుంచి సాయంత్రం వరకు..

త్రిపురారం: మండలంలోని బాబు సాయిపేటలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం ఇన్‌స్పెక్షన్ ప్యానెల్ టీం సందర్శించింది. ఆ టీం హెడ్ రమావత్ రవితో పాటు 8 మంది సభ్యుల బృందం ఉదయం టిఫిన్ నుంచి సాయంత్రం వరకు అన్ని విషయాలను పరిశీలించారు. పాఠశాలలో భోజనం, పరిశుభ్రత, తరగతి గదిలో బోధన, విద్యార్థుల ప్రవర్తన, పాఠశాల రికార్డులు, నిర్వహిస్తున్న పరీక్షలు, విద్యార్థుల గ్రేడ్‌ల వంటి విషయాలను తనిఖీచేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈఓ బాలాజీనాయక్, ప్యానల్ టీం సభ్యులు సత్యనారాయణరెడ్డి, ఎలిషా, మాధవీలత, మల్లారెడ్డి, నర్సింహ, కృష్ణయ్య, ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు నాగలక్ష్మి, శైలజ, రజిత పాల్గొన్నారు.


కేజీబీవీ పాఠశాలలోని వంట గదిని పరిశీలిస్తున్న తనిఖీ బృందం సభ్యులు


అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

## అయ్యప్ప ఆలయంలో మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు ప్రత్యేక పూజలు

మిర్యాలగూడ, డిసెంబర్ 13: పట్టణంలోని అశోక్‌నగర్‌లోగల అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడవిదేవులపల్లి, దామరచర్ల జడ్పీటీసీలు కుర్ర సేవ్యానాయక్, ఆంగోతు లలితహతీరాంనాయక్, రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అన్నభీమోజు నాగార్జునచారి, అయ్యప్ప స్వామి ఆలయ శాశ్వత చైర్మన్ ముక్కపాటి వెంకటేశ్వర్‌రావు, మాశెట్టి శ్రీనివాస్‌నాయుడు, గుడిపాటి నవీన్, రాము పాల్గొన్నారు.

## నీటి లభ్యతను బట్టి పంటలు సాగు చేయాలి

• ఏడీఏ నాగమణి

మిర్యాలగూడ రూరల్, డిసెంబర్ 13: రైతులు నీటి లభ్యతను బట్టి పంటలను సాగు చేయాలని వ్యవసాయ మిర్యాలగూడ సంచాలకులు(ఏడీఏ) నాగమణి అన్నారు. బుధవారం మండలంలోని ఐలాపురంలో రైతులకు వరికి ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిర్యాలగూడ డివిజన్ పరిధిలో ఎక్కువ సాగు ప్రాంతం నాగార్జునసాగర్ ఆయకట్టు కింద స్థిరీకరింపబడిందని తెలిపారు. ప్రస్తుతం వరికి సాగునీరు అందించే పరిస్థితిలో సాగర్ రిజర్వాయర్ లేదని అన్నారు. దీనికి తోడు వర్షపాతం తక్కువ నమోదు కావడంతో వరి సాగుకు నీరు లభించదన్నారు. నీటి లభ్యతను ఆధారంగా ఆరు తడి పంటలైన మినుము, పెసర, ఉలువ, బొబ్బెర, జొన్న, సజ్జ, రాగి, పొద్దుతిరుగుడు వంటివి సాగు సాగుచేయాలని సూచించారు. రైతులు పరిస్థితులను అర్థం చేసుకొని దానికి అనుగుణంగా ఆరుతడి పంటలు వేసుకొని లాభాలను పొందాలని కోరారు. రైతులు తమ భూముల మట్టి నమూనాను సేకరించి వ్యవసాయ విస్తరణాధికారి ద్వారా భూసార పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. భూమి లక్షణానికి అనుగుణంగా ఎరువులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ గుర్రం సరిత, ఏఈఓలు అజ్మీరా సైదులు, రమేశ్, ఎండీ .రఫీ, ఎస్.వెంకన్న, సైదానాయక్, రూప్ల పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ నాగమణి

## రైతులు ఆరుతడి పంటలను వేసుకోవాలి

అడవిదేవులపల్లి: రైతులు ఆరుతడి పంటలైన పెసర, మినుము, అలసంద వంటి పంటలను సాగు చేసుకోవాలని ఏఈఓ రావుల నరేష్ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తనందికొండ గ్రామంలో రైతులు సాగు చేస్తున్న వేరుశనగ, అపరాల పంటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. కొత్తగా పాస్‌బుక్కులు పొందిన రైతులు రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఈవో మహేష్‌నాయక్, రైతులు స్వామి, దేశ్యానాయక్, బూరో, పుల్లారావు పాల్గొన్నారు.


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఈఓ నరేశ్

## ఇన్‌స్టాగ్రామ్ పరిచయం.. మైనర్ బాలిక అదృశ్యం

కేసు నమోదు చేసిన పోలీసులు

నిడమనూరు, డిసెంబర్ 13: ఇన్‌స్టాగ్రాంలో పరిచయంతో ఓ మైనర్ బాలిక అదృశ్యమైన సంఘటన నిడమనూరు మండల కేంద్రంలో వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఓ మైనర్ బాలిక పదో తరగతి చదువుతోంది. ఆ బాలికను తల్లి కూలి చేసి చదివిస్తోంది. ఈ నేథ్యంలో ఇన్‌స్టాగ్రామ్‌లో పెద్దవూర మండలానికి చెందిన యువకుడితో పరిచయం ఏర్పడింది. దాంతో నిత్యం వారు చాటింగ్‌లో మునిగి తేలారు. 10 రోజుల క్రితం సదరు బాలిక అదృశ్యమైంది. ఈమేరకు ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయ గా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

### విస్తుపోయే నిజాలు...

మైనర్ బాలిక అదృశ్యానికి సంబంధించి పోలీసుల విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో పెద్దవూరకు చెందిన ఓ మైనర్ బాలుడి (9 వ తరగతి)తో పరిచయం ఏర్పడింది. కొన్నిరోజుల క్రితం మైనర్ బాలిక ఆ బాలుడి ఇంటికి వెళ్లింది. కాగా బాలుడి తరపు బంధువులు బాలికను ఆమె తల్లికి అప్పగించినట్లు తెలిసింది. అయితే బాలిక మరో ఇద్దరితోనూ చాటింగ్‌లో ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. కాగా సదరు బాలిక ఆచూకీ కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో పరిచయాల కారణంగా ఆకర్షణకు గురవుతున్న బాలికలు ఇన్‌స్టాగ్రామ్ ప్రేమ పేరుతో ఇంటి నుంచి వెళ్లిపోతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో కూడా ఫేస్‌బుక్‌లో పరిచయమైన వ్యక్తి కోసం తుమ్మడం గ్రామానికి చెందిన మైనర్ బాలిక అదృశ్యమైన సంఘటన వెలుగు చూసింది. మైనర్ బాలిక అదృశ్యం విషయమై ఎస్ఐ గోపాల్‌రావు వివరణ కోరగా బాలిక అదృశ్యం పై మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాలిక ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు వివరించారు.


## న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

• పోస్టల్ ఉద్యోగుల సమ్మె

హాలియా, డిసెంబర్ 13: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ బుధవారం హాలియాలో పోస్టల్ ఉద్యోగులు స్థానిక పోస్టాఫీస్ ముందు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పోస్టల్ ఉద్యోగులు మాట్లాడుతూ తమకు ఎనిమిది గంటల పనిదినాలు కేటాయించాలని, పెన్షన్ మంజూరు చేయాలని, అదనపు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కమలేశ్చంద్ర కమిటీ సిఫార్సులను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమణారావు, శ్రీనివాసరెడ్డి, గార్లపాటి శ్రీనివాస్, సబిత, జావీద్, రామేశ్వరి, అన్వర్, సైదులు పాల్గొన్నారు.

### పని ఒత్తిడి తగ్గించాలి

పెద్దవూర: గ్రామీణ డాక్ సేవక్‌లపై పని ఒత్తిడిని తగ్గించాలని పోస్టల్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో పోస్టాఫీస్ ముందు తపాలా ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దవూర గ్రామీణ డాక్ సేవక్ ఎండీ జానీమియా మాట్లాడుతూ 125 ఏండ్ల బ్రిటీష్ చట్టాలను అమలు పరుస్తూ గ్రామీణ డాక్ సేవక్‌లతో 24 గంటలు పని చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ చట్టాలను రద్దు చేసి కమలేశ్చంద్ర కమిటీ సిఫారస్‌లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు మల్లేశ్వరి, శ్రీనివాస్, సమరసింహారెడ్డి, అనంత శర్మ, సందీప్ లోకేష్, సౌజన్య, మాధవి, బానుమతి పాల్గొన్నారు.


పెద్దవూర పోస్టాఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు